క్లుప్తంగా

అమ్మవారికి పుష్పయాగం

జమ్మలమడుగు : శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణదినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా శనివారం అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు వివిధ రకాల పుష్పాలతో అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



అర్బన్ సీఐ నరసింహులుకు నగదును అందిస్తున్న వ్యాపారస్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు శనివారం షరాబు, వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు పట్టాభి రామయ్య, కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి సనత్‌కుమార్, సభ్యులు దక్షిణామూర్తి, ప్రకాష్ సేట్‌లు రూ.లక్ష విరాళంగా అందించారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న అర్బన్ సీఐ నరసింహులుకు వారు ఈ నగదును అందించారు. సీసీ కెమెరాలకు ఏర్పాటుకు నగదును విరాళంగా ఇచ్చిన వారిని ఆయన అభినందించారు.

మైలవరం జలాశయంపై రాకపోకలు బంద్

జమ్మలమడుగు : ఫిబ్రవరి నుంచి మైలవరం జలాశయం కట్టపై రాకపోకలను నిలిపివేసినట్లు డీఈ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం జలాశయం గేట్ల వద్ద స్పిల్‌వే పనులు చేపడుతుండటంతో పనులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజలు, పర్యాటకులు మైలవరం జలాశయంపై నుంచి వెళ్లకుండా నిలిపివేశామన్నారు. స్పిల్ వే పనులు పూర్తి చేసిన తర్వాత తిరిగి రాకపోకలను పునరుద్ధరిస్తామని డీఈ సూచించారు.

శిక్షణ నిమిత్తం ఎర్రగుంట్లకు వచ్చిన ట్రైనీ డీఎస్పీ

ఎర్రగుంట్ల : స్థానిక పోలీస్‌స్టేషన్‌కు శిక్షణలో భాగంగా ట్రైనీ డీఎస్పీ భవాని శనివారం వచ్చారు. ఈ మేరకు ఆమె మూడు వారాలు పాటు స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ రకాల కేసులపై ట్రైనింగ్ తీసుకుంటారు. కదిరి పట్టణంనకు చెందిన భవానీ గ్రూపు–1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. పలురకాల కేసులపై పట్టణ సీఐ నరేష్‌బాబు ట్రైనీ డీఎస్పీకి వివరించారు.

ఆలస్యంగా పింఛన్ల పంపిణీ

లింగాల : మండలంలో సర్వర్లు పనిచేయక పింఛన్ల పంపిణీ ఆలస్యంగా జరిగింది. శనివారం ఉదయం 6 గంటలకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాలలో పింఛన్లు పంపిణీ చేయడానికి చేరుకున్నారు. అయితే సర్వర్లు పనిచేయక ఉదయం 9 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వృద్ధులు, వికలాంగులు, పనులకు వెళ్లే వితంతువులు పింఛన్ల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో వలంటీర్లు తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్ల తలుపులు కొట్టి పింఛన్లను అందించేవారని వృద్ధులు తెలిపారు. ప్రస్తుతం పింఛన్లు ఎప్పుడిస్తారోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

సింహాద్రిపురం : మండలంలోని బీసీ, కాపు (బలిజ, ఒంటరి తెలగ) రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, ఈబీసీ, బ్రాహ్మణ సామాజిక వర్గాలకు చెందిన బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణం పొందుటకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8వ తేదీ నుండి 11 తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

అందుబాటులో ఉండాలి

ఎర్రగుంట్ల : మండలంలో ఉన్న సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. శనివారం హనుమనుగుత్తి గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు సకాలంలో సచివాలయంకు చేరుకోవాలని సూచించారు. అలాగే సీనియర్ సిటిజన్ వివరాలను, బయోమెట్రిక్ హాజరు, పింఛన్ల పంపిణీ తదితర వాటిపై విచారణ చేశారు.

ఘనంగా పూజలు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని పొంటెన్ వద్ద అశ్వర్థనారాయణస్వామి పూజ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. మాఘ మాసం సందర్భంగా ప్రతి ఏడాది అశ్వర్థ నారాయణ స్వామి పూజ కార్యక్రమాలను దాత సహకారంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

లింగాల : మండలంలోని అంబకపల్లె గ్రామంలో శివగంగిరెడ్డి ఇంట్లోని బెల్టు షాపులో మద్యం అమ్ముతుండగా దాడి చేసి 56 మద్యం బాటిళ్లను పట్టుకుని కేసు నమోదు చేశామని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక లింగాల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు.

యథేచ్ఛగా అక్రమ ఇసుక తరలింపు



చిలంకూరు మార్గంలో తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్లు



ముద్దనూరు రోడ్డులో పోతున్న ఇసుక ట్రాక్టర్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండలంలోని ఇల్లూరు, చిన్నదండ్లూరు, పోట్లదుర్తి, బీస్మిల్లాబాదు, హనుమనుగుత్తి, కమలాపురం మండలంలో కొగటం, జమ్మలమడుగు మండలంలో సిరిగేపల్లి గ్రామాల మధ్య పెన్నానది నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకకు డిమాండ్ ఉంది. దీన్ని ఇసుక మాఫియా ఆదాయ వనరుగా మార్చుకుంది. ఇలా ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ తవ్వేస్తున్నారు. పెన్నానది పరివాహక ప్రాంతాలైన బీస్మిల్లా బాదు, పోట్లదుర్తి, ఇల్లూరు, చిన్నదండ్లూరు, కమాలపురం గ్రామంలోని కోగటం గ్రామాల నుంచి ప్రతి రోజు ఎడతెరిపి లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్లు పోతున్నా పట్టుకునే వారు కరువయ్యారు. ఇదే అదునుగా చేసుకుని అక్రమ దారులు ప్రతి రోజు ఇసుకను తరలిస్తున్నారు. ఇప్పటికైన నియంత్రణ చేయకపోతే భవిష్యత్ పెన్నానదిలో బోర్లన్నీ ఎండిపోయి నీటి కొరత తీవ్రంగా ఏర్పడి ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్ హుసేన్

కమలాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో వైద్యులు షాకీర్‌హుసేన్ తెలిపారు. శనివారం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షించి 562 మందికి ప్రివెంటివ్ మెడిసిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలం నుంచి ఎండాకాలంకు రుతువులు మారుతున్న వేళ వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వస్తుంటాయన్నారు. తద్వారా వివిధ రకాల రోగాలు ప్రబలుతాయన్నారు. ప్రస్తుతం చికెన్ ఫాక్స్ (అమ్మవారు) తదితర వ్యాధులు ఎక్కువగా ప్రజల్లో ఉందన్నారు. అందుకే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులసమ్మ విజ్ఞప్తి మేరకు శిబిరం నిర్వహించి విద్యార్థులకు ఎలాంటి రోగాలు దరి చేరకుండా ముందస్తు జాగ్రత్తగా పల్సటిల్లా–200 నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. ముఖ్యంగా ఈ హోమియో మందులు వినియోగిస్తే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. అలాగే దీర్ఘకాలిక రోగాలు సైతం దూరం అవుతాయన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా కమలాపురంలో ప్రభుత్వ ఆసుపత్రిలోనే హోమియో వైద్యశాల కొనసాగుతోందని, ప్రతి మంగళ, గురు, శని వారాలలో అందుబాటులో ఉంటామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

కష్టపడి చదివి జీవితంలో స్థిరపడాలి



మాట్లాడుతున్న ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ విజయ్‌కుమార్

వేంపల్లె : కష్టపడి చదివి జీవితంలో స్థిరపడాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో 2008 బ్యాచ్ పూర్వపు విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుంది. మొదటిరోజు ఆర్కే వ్యాలీలోని కంప్యూటర్ సెంటర్ దగ్గర మొక్కలు నాటి కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. మొట్టమొదటిగా ఇడుపులపాయలో 2008 సంవత్సరంలో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేసి ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా 2008 బ్యాచ్ విద్యార్థులు బీటెక్ పూర్తి చేసుకుని పదేళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరై తమ గత అనుభవాలను క్యాంపస్‌లో ప్రస్తుతం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులతో, అధ్యాపకులతో పంచుకున్నారు. చివరగా ఆర్కే వ్యాలీ లలిత కళా విభాగం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో తొలిరోజు కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీల డైరెక్టర్లు ప్రొఫెసర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, ప్రొఫెసర్ భాస్కర్ పటేల్, ప్రొఫెసర్ బాలాజి, ఆర్జీయూకేటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రసాద్, పరిపాలన అధికారి పి.రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్ కైలాస్, రూపస్‌కుమార్, పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎండీ రఫీ, అధ్యాపక, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వం అన్నింటా విఫలమైంది



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఈనెల 5వ తేదీన వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వకపోవడంతో కాలేజి యాజమాన్యాలు విద్యార్థులపై వత్తిడి తీసుకుని వచ్చి ఫీజులు కట్టించుకుంటున్నారు. కొంత మంది విద్యార్థులు ఫీజులు కట్టలేక ఉన్నత చదువులు ఆపేయడం జరుగుతుంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఎందరో నిరుపేదలు ఉన్నత స్థాయికి చేరున్నారు. ఈ పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు కంటిన్యూ చేశారు. ప్రస్తుత పాలనలో విద్యార్థులకు ఇవ్వకపోడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లల చదువులకు అప్పులు చేసుకోవలసి వస్తుందన్నారు. వెంటనే నిధులు విడుదల చేయాలనే లక్ష్యంతో ఈనెల 5వ తేదీన విద్యార్థుల పక్షనా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవ రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మార్బల్ శ్రీను, సురేష్, గిరిధర్‌రెడ్డి, జి.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయాలి



వల్లూరు పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

వల్లూరు : వ్యాధి నిరోధక టీకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి సకాలంలో వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని గంగాయపల్లెలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి వైద్య సిబ్బందితో ఆరా తీసి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం పోషకాహారము, అంటువ్యాధులు మొదలైన అంశాలపై సమీక్షించారు. లెప్రసీ సర్వే జరుగుతున్న తీరు గురించి సమీక్షించి, సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం వల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఓపీని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈహెచ్‌ఆర్ వార్డును, కాన్పుల గదిని పరిశీలించారు. వ్యాధినిరోధక టీకాలు, ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిడమాలజిస్ట్ ఖాజామొద్దీన్, సూపర్‌వైజర్ రాఘవ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, సీహెచ్‌వో వేణుగోపాల్ రావు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మ రక్షణ – దేశ రక్షణ కోసమే మహా పాదయాత్ర



పాదయాత్రగా వెళ్లనున్న బృందం

పులివెందుల టౌన్ : ధర్మ రక్షణ–దేశ రక్షణ, మానవాళి సంరక్షణ, సర్వేజనా సుఖినోభవంతు అన్న నినాదంతో కాశీకి మహా పాదయాత్ర ప్రారంభించినట్లు పాదయాత్ర మార్గదర్శకులు మడూరు వెంకటశేషయ్య తెలిపారు. శనివారం ఉదయం పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో కాశీ మహాపాదయాత్ర బృంద సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం వారు యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మహా పాదయాత్ర పథ నిర్దేశకులు వెంకటశేషయ్య మాట్లాడుతూ సకల మానవాళి శాంతితో జీవనం సాగించాలని, హిందూ ధర్మాన్ని సంరక్షించాలని, ధర్మ ప్రచారమే ధ్యేయంగా దేశ రక్షణకు తోడ్పాటునందించేందుకు స్ఫూర్తిగా నిలిచేందుకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. పులివెందుల నుంచి కాశీ మహా పాదయాత్ర ప్రారంభించిన పాదయాత్ర బృందం మొదటి రోజు బలపనూరు, అంకాలమ్మ గూడూరు, కసనూరు, సింహాద్రిపురం, లావనూరు, కొండాపురం వరకు తమ పాదయాత్రను కొనసాగించారు. పులివెందులకు చెందిన వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమ నిర్వాహకులు అనిమెల రామ్మోహన్, దీనబంధు ట్రస్ట్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, సీనియర్ జర్నలిస్ట్ అల్లం రంగనాయకులు, డిప్యూటీ సర్వేయర్ ఆఫీసర్ నాగరాజు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ సర్వేశ్వరరెడ్డి, తుంగభద్ర హెచ్‌ఎల్సీ కెనాల్ ప్రాజెక్టు అధ్యక్షుడు జోగిరెడ్డి, లింగాలకు చెందిన డ్రిప్ కంపెనీ యజమాని కేశంరెడ్డి నాగకృష్ణారెడ్డి, తదితరులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

పింఛన్ల పంపిణీ

కమలాపురం : ఇంటింటికి తిరిగి సామాజిక భద్ర పింఛన్లు పంపిణీ చేసినట్లు కమలాపురం మున్సిపల్ కమిషన్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శనివారం ఆయన నగర పంచాయతీలోని అర్హులందరికి ఇళ్లకు వెళ్లి వితంతువు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి కార్యదర్శులు పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు.

లైసెన్స్‌లు కలిగి ఉండాలి

పులివెందుల రూరల్ : వాహనదారులు లైసెన్స్ లు కలిగి ఉండాలని ఎస్ఐ నారాయణ తెలిపారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండు శ్రీవెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించి లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. అలాగే ట్రిపుల్ రైడింగ్ వెళుతున్న వాహనాలకు జరిమానా విధించారు. చాలామంది లైసెన్స్ లేనివాళ్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభను జయప్రదం చేయండి

కమలాపురం : కరువు పీడిత రాయలసీమ నీటి అవసరాలు, ప్రాజెక్ట్ నిర్మాణం, నీటి వివాదాలు పరిష్కార మార్గాలపై ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు కడపలో నిర్వహించనున్న ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. శనివారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమ శాశ్వత విముక్తికై కృష్ణా జలాల సాధన కోసం చేపట్టిన సమరశీల పోరాటాలకు పాలక ప్రభుత్వాలు గాలేరు–నగరి, హంద్రీ–నీవా, తెలుగు గంగ, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. అయితే నాలుగు దశాబ్దాలు దాటుతున్న ప్రాజెక్టులు పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తున్నారని మండి పడ్డారు. సీమలో తగినంత వర్షపాతం నమోదు కాక ప్రతి ఏటా కరువు బారిన పడి చేసిన అప్పులు తీర్చలేక అవమాన భారంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సీమల్లో ఉపాధి పనులు లేక వలసలు పోతున్నారని గుర్తు చేశారు. అతివృష్టి, అనావృష్టికి శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తే వాటి ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఏకరాకు సాగునీరు అందించవచ్చన్నారు. ఈ సభకు అన్నదాతలు, అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, పండితులు హాజరై విజయంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉచిత న్యాయ సహాయంపై అవగాహన



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని సబ్ జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో ఉన్న రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యత, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్, కౌన్సిల్ సిస్టం, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహిస్తున్నామని ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వలంటీర్, ఖైదీలు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన బాధిత రైతుకు ఆర్థిక సాయం

వేంపల్లె : అడవి పందులవల్ల పంట నష్టపోయిన బాధిత రైతుకు ఫారెస్ట్ అధికారులు ఆర్థిక సహాయాన్ని అందించారు. శనివారం బాధిత రైతు కె.సువర్ణ సోదరుడు ఈశ్వర్‌రెడ్డికి ఫారెస్ట్ రేంజర్ బాలసుబ్రమణ్యం రూ.90,270 చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె గ్రామానికి చెందిన కె.సువర్ణ తన వ్యవసాయ భూమిలో అరటిపంటను సాగు చేసింది. అయితే అడవి పందుల దాడితో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆమె ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా అరటిపంటను పరిశీలించి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ ఖాదర్ జిలాని, బీట్ ఆఫీసర్ శివమోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడి గెలవాలి

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడి గెలవాలని ఆర్టీపీపీ సీఈ ఎం.గౌరీపతి తెలిపారు. శనివారం ఆర్టీపీపీ క్రికెట్ టీంకు ఆయన క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. ఈనెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నెల్లూరులో ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో డిస్కంల పరిధిలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. ఈ టోర్నమెంట్‌కు 36 టీంలు వస్తున్నాయన్నారు. అందులో ఆర్టీపీపీ నుంచి టీం పాల్గొంటుందన్నారు. టీం కెప్టెన్ జీ రమేష్‌బాబు, కోచ్ ఎస్.రామప్రసాద్ ఆధ్వర్యంలో టీం బయలు దేరుతుందన్నారు. ప్రతి క్రీడాకారుడు మంచి ప్రతిభను కనపరించి ఆర్టీపీపీకి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సివిల్ ఇన్‌చార్జి ఎస్ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి చేయూత అభినందనీయం

వేంపల్లె : క్రీడాభివృద్ధికి చేయూతనందించడం అభినందనీయమని వేంపల్లి తలిశెట్టి సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శివ మునెమ్మ తెలిపారు. ఈనెల 3వ తేదీన ఆ పాఠశాల 77వ వార్షికోత్సవ సందర్భంగా జరిగే క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులకు సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి రూ.10వేలు నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో పీఈటీ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంత రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు తనవంతు కృషి చేస్తానని విద్యుత్‌శాఖ రూరల్ ఏఈగా రమేష్ తెలిపారు. గతంలో ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న మురళి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో రమేష్ శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా శ్రీ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో శ్రీసీతారామ,లక్ష్మణ, ఆంజనేయస్వామి మూలవిరాట్



శ్రీ సీతారాముల కల్యాణంలో తాళిని చూపుతున్న వేద పండితులు

తొండూరు : మండలంలోని బూచుపల్లెలో శనివారం శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్టను వేద పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీలకు రాయలసీమ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి సీనియర్ ఎద్దులు వచ్చి బండను లాగాయి. ఈ పోటీలలో నంద్యాల జిల్లా గుంపరమనుద్దిన్నే మండలం చౌటపల్లె, కుందురు గ్రామాలకు చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు 2258 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.లక్ష నగదును పొందాయి. మైదుకూరు పట్టణానికి చెందన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 2256 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన ఎం.నాగయ్య ఎద్దులు 2022 అడుగులు లాగి మూడవ స్థానంలో, చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబుళరెడ్డి ఎద్దులు 1856 అడుగులు లాగి నాల్గవ స్థానంలో, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ద్వార్షల గురివిరెడ్డి ఎద్దులు 1837 అడుగులు లాగి 5వ స్థానంలో, అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన రమేష్‌బాబుయాదవ్ ఎద్దులు 1754 అడుగులు లాగి 6వ స్థానంలో, కమలాపురం పట్టణానికి చెందిన సుబ్బారాయుడు ఎద్దులు 1750 అడుగులు లాగి 7వ స్థానంలో, రంగోరుపల్లెకు చెందిన మహేందర్‌రెడ్డి ఎద్దులు 1533 అడుగులు లాగి 8వ స్థానంలో, రంగసాయిపల్లెకు చెందిన శ్రీరాములు యాదవ్ ఎద్దులు 1506 అడుగులు లాగి 8వ స్థానంలో నిలిచాయి. ఆయా స్థానాలలో నిలిచిన ఎద్దులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణం

వల్లూరు : మండలంలోని గొల్లఓబాయపల్లెలోని కోదండరామాలయంలో శనివారం సీతా రాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఆలయ నూతన ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా 108 కళశాలతో అభిసేకాలను నిర్వహించారు. హోమాల అనంతరం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



బండను లాగుతున్న ఎద్దులు